సాక్షి చిత్తూరు

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,000
రిటైల్ వెండి గ్రాము	రూ.69

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	18
తిరుపతి	36	18
తిరుమల	31	14
గూడూరు	34	19
నగరి	34	18



నంది వాహనంపై చిద్విలాసం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు నంది హనంపై, అమ్మవారు కామధేనువుపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.

న్యూస్‌రీల్

వాహన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న కరుణకుమార్

చిత్తూరు రూరల్: వాహన చట్టాలపై డ్రైవర్లకు అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ తెలిపారు. సోమవారం చిత్తూరు డీటీసీలో మోటారు వాహన చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థ వల్ల రవాణాశాఖలో అవినీతిపై ఆరోపణలు అధికంగా ఉంటాయన్నారు. అందుకే ఆన్‌లైన్ విధానం వచ్చినట్లు వెల్లడించారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ సిస్టంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పక్కాగా ఉండేలా ఎంవీఐలు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డీటీసీ బసిరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారానే ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రవాణా శాఖ పరిధిలోని సమస్యలపై నేరుగా తనను సంప్రదించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రాజశ్వేరరావు, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

నేడు బోయ, వాల్మీకులతో ఏకసభ్య కమిషన్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ కులాలకు సంబంధించిన సమస్యలపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్ కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈ మేరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు బెంట ఒరియా, బోయ, వాల్మీకి తదితర కులాలకు చెందిన నేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వేగంగా సోలార్ ఫెన్సింగ్ నిర్మాణం

చిత్తూరు కార్పొరేషన్: పలమనేరు, కుప్పం సమీపంలోని అటవీ ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుమారు రూ.32 లక్షల వ్యయంతో 6 కిలోమీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏనుగుల కట్టడే లక్ష్యంగా 14 అడుగుల ఎత్తులో తోరణాల్లా ఫెన్సింగ్ వేలాడదీస్తున్నామని వివరించారు.

'హరిత' పాఠశాలలకు అభినందన

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హరిత అవార్డులకు ఎంపికైన పాఠశాలలకు ఏపీ ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ కోర్) డైరెక్టర్ పి.ప్రవంతి సోమవారం అభినందనలు తెలిపారు. ఎన్‌జీసీ, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ కింద హరిత అవార్డులు ప్రకటించారు. రాష్ట్రం నుంచి మొత్తం 2,187 పాఠశాలలు నమోదు చేసుకోగా పది స్కూళ్లు అవార్డుకు ఎంపికయ్యాయి. అందులో 9 పాఠశాలలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందినవే కావడం విశేషం. మంగళవారం ఈ మేరకు న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానం నిర్వహించనున్నారు.

ఎన్నికల అబ్జర్వర్‌గా కోన శశిధర్



చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌గా కోన శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ప్రకటించారు. కోన శశిధర్ జిల్లాలో ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ పూర్తయ్యే వరకు మొత్తం ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

వన్నెకుల క్షత్రియులకు ప్రాధాన్యం



సమావేశంలో వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు

కుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వన్నెకుల క్షత్రియులకు తగిన ప్రాధాన్యం దక్కిందని వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనతి తెలిపారు. సోమవారం కుప్పంలో ఆమె మాట్లాడుతూ వన్నెకుల సామాజిక వర్గానికి చెందిన సిపాయి సుబ్రమణ్యంను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికచేయడం హర్షణీయమన్నారు. ఆయన తిరుపతిలో ఆస్పత్రి నిర్వహిస్తూ పేదలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే ఎమ్మెల్సీ భరత్‌ను జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కూడా నియమించారని తెలిపారు. వన్నెకుల క్షత్రియులందరూ ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. సమాశంలో ఎంపీపీ అశ్వని, నేతలు దండపాణి, మునిరత్నం, వరదరాజులు, తిమ్మరాయ పాల్గొన్నారు.

విరులు.. సిరులు!

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని రైతులు వ్యవసాయంలో కొత్తపుంతలు తొక్కుతున్నారు. ఎప్పటికప్పుడు నూతన రకాలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇప్పటివరకు కూరగాయలు.. ఇతర వాణిజ్య పంటల్లో మెరుగైన ఫలితాలు సాధించేవారు. ప్రస్తుతం పూల సాగుపై మక్కువ పెంచుకుని ఆదాయ మార్గంలో పయనిస్తున్నారు. ఈ ప్రాంతంలోని శీతల వాతావరణ పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటున్నారు. ముఖ్యంగా బంతి.. చామంతి పూలను సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందుతున్నారు. కర్ణాటక, తమిళనాడులో మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌ను సక్రమంగా వినియోగించుకుని ముందడుగు వేస్తున్నారు.

- లాభాల బాటన పూలసాగు
- బంతి, చామంతి ధరలకు రెక్కలు
- కొత్త వెరైటీలపై ఆసక్తిచూపుతున్న రైతులు
- పెళ్లిళ్ల సీజన్ కావడంతో అధిక డిమాండ్
- తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఇతర రాష్ట్రాలకు పెరిగిన ఎగుమతులు





పలమనేరు మండలంలో సాగు చేస్తున్న బంతి (ఇన్‌సెట్) విరగ్గాసిన రబ్బర్ చామంతి

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాలైన వి.కోట, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, బైరెడ్డిపల్లె, గంగవరంలో పూల సాగు ఏటా పెరుగుతోంది. గత ఏడాది 400 ఎకరాల్లో పూలు సాగు చేస్తే, ప్రస్తుతం 410 ఎకరాల్లో పూలసాగు చేపట్టారు. అందులో అధికంగా బంతి, చామంతిని పండిస్తున్నారు. బంతిలో విష్ణు, అష్టగంధ, అశోక, బిగ్‌బాల్ ఆరెంజ్, ఎల్లో బంతి రకాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. చామంతిలో పేపర్‌ఎల్లో, పేపర్‌వైట్ రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇవన్నీ హైబ్రీడ్ రకాలు కావడంతో పంట ఏపుగా పెరిగి ఉత్పత్తులు అధికంగానే వస్తున్నాయి.

40 రోజులకే కోత!

బంతి, చామంతి మొక్కలను వి.కోట, కర్ణాటకలోని బేతమంగళ, కోలారు నర్సరీల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో మొక్కను రూ.2 నుంచి రూ.2.50 పైసలకు అమ్ముతున్నారు. ఈ క్రమలో రైతులు ఎకరాకు 12వేల మొక్కలు నాటుకోవాల్సి ఉంటుంది. మొక్క నాటాక 40 రోజుల నుంచి పూల కోతలు మొదలవుతాయి. మూడునెలలదాకా దిగుబడులుంటాయి. ముఖ్యంగా సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఫ్లవరింగ్ బావుంటుందని రైతులు చెబుతుంటారు. ఈ సమయంలో దిగుబడి అధికంగా వస్తుంది. కొందరు రైతులు పాలిహౌస్ ఏర్పాటు చేసుకుని బంతి, చామంతి సాగు చేస్తున్నారు. మొక్క పెరిగేదాకా ఎల్‌ఈడీ లైట్లు పెట్టి, 45 రోజుల తర్వాత బ్లాక్‌షీట్‌లు కప్పి అధిక దిగుబడులు సాధిస్తున్నారు.



నర్సరీలో సిద్ధంగా బంతి, చామంతి మొక్కలు

ఆశాజనకంగా ధరలు

పూల సాగుతో రైతులకు మంచి గిట్టుబాటు దక్కుతోంది. బంతి, చామంతి సాగుకు ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దిగుబడి బాగా వస్తే ఎకరానికి 10 టన్నుల వరకు పూలు ఉత్పత్తి అవుతాయి. ప్రస్తుతం టన్ను పూల ధర రూ.50 వేల నుంచి రూ.60 వేలుగా ఉంది. ఈ లెక్కన ఎకరానికి రూ.5లక్షల నుంచి రూ.6లక్షల రాబడి ఉంటుంది. పెట్టుబడి రూ.లక్ష పోయినా రైతుకు నికరంగా రూ.4లక్షల వరకు మిగిలే అవకాశముంది.

సులువుగా మార్కెటింగ్

ఈ ప్రాంతం నుంచి బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్‌కు ఎక్కువగా పూలు ఎగుమతి చేస్తున్నారు. బయటి రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వి.కోట, కుప్పం, శాంతిపురం, పుంగనూరు, పలమనేరు మార్కెట్లకు వచ్చి భారీగా పూలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్లు, పండుగల సీజన్ నడుస్తుండడంతో తోటల వద్దకే వెళ్లి మరీ పూలు కొంటున్నారు.

ఉద్యానశాఖ ప్రోత్సాహం

పూల సాగు చేస్తున్న రైతులకు ఉద్యానశాఖ ప్రోత్సాహాలను అందిస్తోంది. చిన్న, సన్నకారు రైతులైతే హెక్టారుకు రూ.16వేలు, పెద్దరైతులైతే రూ.10వేలు మంజూరు చేస్తోంది. ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుని రైతులు పూల సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో మరింత మంది రైతులు పూలసాగు దిశగా అడుగులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

లాభదాయకం



నేను బంతి, చామంతి, రోజా తదితర పూలను నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా. ఇప్పుడు బంతి పూలు కోతకు వచ్చాయి. ప్రస్తుత సీజన్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇతర పంటలకు పెట్టుబడి ఎక్కువ, అంత పెట్టినా లాభం వస్తుందనే గ్యారెంటీ లేదు. అయితే డిమాండ్ ఎప్పుడు ఉంటుందో గమనించుకుని పూల సాగు చేస్తు కచ్చితంగా అధిక ఆదాయం పొందవచ్చు. ఏది ఏమైనా పూల సాగు లాభదాయకమే.

– శివ, రైతు, చీలంపల్లె

సీజన్‌లో మంచి ధరలు



జిల్లాలోనే పూల సాగు పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో ఎక్కువగా ఉంది. ఇక్కడి రైతులు పూలసాగుతో అధిక లాభాలు పొందుతున్నారు. అందుకే ఏటా ఇక్కడ పూల సాగు పెరుగుతోంది. పెద్దగా చీడపీడల బాధ లేకుండా తక్కువ పెట్టుబడితోనే లాభాలుంటున్నాయి. సీజన్‌లో అయితే మంచి ధరలుంటాయి. ప్రభుత్వ కూడా పూల సాగుకు ప్రోత్సాహం అందిస్తోంది.

– కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

జగనన్నతోనే బడుగుల అభ్యున్నతి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : బడుగుల అభ్యున్నతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. సోమవారం పుత్తూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయ స్వాతంత్య్రం వచ్చిందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అన్ని సామాజికవర్గాలకు అవకాశం కల్పించారన్నారు. చంద్రబాబు ఓట్ల కోసం కులాల మధ్య చిచ్చుపెడుతుంటారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలను బట్టి ఎప్పుడూ ఓట్లు అడగలేదని తెలిపారు. ముఖ్యంగా బలహీన వర్గాల పక్షపాతిగా వారి సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు.రాజకీయంగా సముచితస్థానం కల్పించారని వెల్లడించారు.

అధికారదాహంతోనే ఆరోపణలు

వెదురుకుప్పం : అధికార దాహంతోనే చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. సోమవారం పుత్తూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కుట్ర రాజకీయాల్లో ఔరంగజేబునే చంద్రబాబు మించిపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుంటే టీడీపీ నేతలు అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అయితే ఎల్లో మీడియా మాత్రం నిత్యం తప్పుడు కథనాలతో దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నవరత్నాలతో పేదల బతుకులు బాగుపడుతుంటే చంద్రబాబు భరించలేకపోతున్నారన్నారు. కేవలం అల్లర్లు సృష్టించేందుకే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో పేదలకు చేసిన సాయం ఏంటో చెప్పకుండా, ప్రభుత్వాన్ని విమర్శించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని వెల్లడించారు. దళితులను, బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగానే చూశారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సముచితస్థానం కల్పించారని తెలిపారు. తాను 200 ఎకరాలు కబ్జా చేసినట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. ఇదేం ఖర్మ పేరుతో ప్రజల ప్రాణాలు బలితీసుకున్నారని, బాదుడే బాదుడుతో జనాలు మిమ్మల్ని బాదేశారని ఎద్దేవా చేశారు. పాదయాత్రకు స్పందన రాకపోవడతో సైకోల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసులకు 'మెడల్స్'



ఎస్పీ రిశాంత్‌రెడ్డితో విశ్రాంత పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం 36 మంది విశ్రాంత పోలీసులకు ఇండిపెండెన్స్ డే మెడల్స్ ప్రదానం చేశారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత పోలీసుల సేవలు మరువలేమని కొనియాడారు. ఎస్పీ చేతుల మీదుగా మెడల్స్ అందుకోవడంపై విశ్రాంత పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జగదీష్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్‌ఐ మధు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీసుల సంఘం అధ్యక్షుడు ఉదయకుమార్, విశ్రాంత పోలీసుల సంఘం అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

చిత్తూరులో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన మురుగేశన్ కుటుంబానికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి చేతులమీదుగా రూ.4లక్షల ఆర్థికసాయం అందించారు. చెక్కును మృతుడి భార్య సుమితకు అందజేశారు. ఏఎస్పీ జగదీష్, ఏఆర్ డీఎస్పీ మురళి, ఆర్‌ఐ మధు పాల్గొన్నారు.

సిపాయి ఎంపికపై హర్షం





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిపాయి సుబ్రమణ్యం, పక్కన ఎమ్మెల్యే బియ్యపు మధు, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి.. స్వీట్లు పంచిపెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మరో సారి జగనన్న ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

తిరుపతి కల్చరల్/శ్రీకాళహస్తి/రేణిగుంట/ఏర్పేడు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎంపికపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిపాయి సుబ్రమణ్యం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ నేపథ్యంలో ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న వన్నెకుల క్షత్రియ సంఘం నేతలు సంబరాల్లో మునిగి తేలారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడులో బాణసంచా పేల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, సంఘం గౌరవాధ్యక్షుడు బుజ్జిరెడ్డి, బీసీ నాయకులు వేలాయుధం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రొఫైల్

పేరు : డాక్టర్. సిపాయి సుబ్రహ్మణ్యం.
వయసు : 64 ఏళ్లు
విద్యార్హత : ఎంబీబీఎస్, ఎంఎస్, ఎం.సీహెచ్
తల్లిదండ్రులు : పార్వతమ్మ, గోవిందరెడ్డి.
భార్య : శాంతి
కుమారుడు : డాక్టర్ సిపాయి కీర్తిసాగర్‌రెడ్డి
కులం : వన్నెకులక్షత్రియ (బీసీ)
జన్మస్థలం : మోపిరెడ్డిపల్లె, పెనుమూరు మండలం
రాజకీయ ప్రయాణం : ప్రజారాజ్యం పార్టీ తరఫున శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి.

- 2020–23 వరకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ
- వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్

ప్రొఫెషనల్ అచీవ్‌మెంట్స్ : రాయలసీమలో మొట్టమొదటగా ల్యాప్రోస్కోపిక్ ఆసుపత్రిని 1998లో స్థాపించారు.

- ఎస్వీ మెడికల్ కళాశాల మాజీ ప్రొఫెసర్, యూరాలజీ విభాగం హెచ్‌ఓడీగా పనిచేశారు.
- ఎస్వీయూ ఈసీ మెంబర్, ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో ఈసీ మెంబర్, మెడికల్ ఎథిక్స్ కమిటీ మెంబర్.

నేడు ఒక్క నామినేషన్



జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి

చిత్తూరు కలెక్టరేట్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి సోమవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి నీలం శామ్యూల్ మోసెస్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు మూడు నామినేషన్లు వచ్చినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సుబ్రమణ్యం (ఫైల్)

నగరి : నెత్తంకండ్రిగ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు ఆదివారం ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కోవడానికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చే క్రమంలో కె.సుబ్రమణ్యం (48) అనే వ్యక్తి నెత్తం కండ్రిగ వద్ద రోడ్డు దాటుతుండగా తమిళనాడు నుంచి తిరుపతికి వెళుతున్న కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యం అందిస్తున్నా ఫలితంలేక మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేశారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

సారా విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్ : బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంటలో సోమవారం సారా విక్రయిస్తున్న శరత్‌బాబు(36) అనే వ్యక్తిని ఎస్‌ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. దాడిలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

నారాయణవనం మండలంలో ఇద్దరు..

నారాయణవనం: సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పుత్తూరు సెబ్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని కీళగరం చెరువుకట్టపై సోదాలు నిర్వహించగా.. సుబ్రమణ్యం(37) అనే వ్యక్తి వద్ద 7 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు శింగిరికోనలోని రాళ్ల కాలువ వద్ద సారా కాస్తున్న వెంకటకృష్ణపాళ్యంకు చెందిన ఈశ్వరయ్య(42)ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

22 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవం



ఆలయ కమిటీ చైర్మన్ బాలచంద్రారెడ్డి

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి 24 దాకా నూతన సువర్ణ విమాన గోపుర శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతి దంపతులు అమ్మవారి విమానగోపురానికి తిరుమల శ్రీవారి ఆనంద నిలయం తరహాలో బంగారు తాపడం పనులు చేయిస్తున్నారని, ప్రస్తుతం ఈ పనులను పూర్తి కావడంతో 22 నుంచి కుంభాభిషేకాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆదేవిధంగా వల్లటూరు సుబ్బమ్మ జ్ఞాపకార్థ ఆమె కుమారుడు, కోడలు వల్లటూరు మధుసూదన్‌నాయుడు–శాంతి దంపతులు ఆలయ ఆవరణలో ఆస్థాన మండపాన్ని నిర్మించారని, ఈ సందర్భంగా ఈ మండపాన్ని కూడా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. 22 నుంచి 24 వరకు త్రయాహ్నిక దీక్షతో అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. 22, 23 తేదీల్లో రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు లక్ష కుంకుమార్చన ఉంటుందని తెలిపారు. 24న 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు కుంకుమార్చన జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు కళత్తూరు జనార్దన్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



విమానగోపురానికి తిరుమల ఆనందనిలయం తరహాలో చేపట్టిన బంగారు తాపడం పనులు పరిశీలిస్తున్న దృశ్యం

ఈ పంట నమోదు తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న పద్మావతి

భాకరాపేట : ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకునేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ కమిషనర్ పద్మావతి తెలిపారు. ఆమె సోమవారం చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, దేవదార్లపల్లె పంచాయతీల్లో పంట నమోదును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఏ రైతూ పంటను సాగు చేసి నష్ట పోకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తద్వారా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించి పంట దెబ్బతింటే పరిహారం అందజేస్తుందన్నారు. పంట నమోదు చేయడంలో రైతు భరోసా కేంద్రాల పాత్ర కీలకమన్నారు. అలాగే రైతులు పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి ధనలక్ష్మి, వీఆర్‌వో నిర్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పల్లెలో గుట్టుగా వ్యభిచారం !

- మహిళా ఎస్ఐ కుటుంబ సభ్యులే నిర్వాహకులు
- ఎస్ఐ తల్లి, తమ్ముడు, మరో ముగ్గురి అరెస్టు

తిరుపతి రూరల్: తిరుపతి ముత్యాలరెడ్డి పల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళా ఎస్ఐ కుటుంబసభ్యులే గుట్టుగా వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. ఏపీలోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి మహిళలను రప్పించి జోరుగా దందా నడుపుతున్నారు. ఆ ఎస్ఐ ఎక్కడ పనిచేస్తే ఆ స్టేషన్ పరిధిలోనే వీరు దుకాణం తెరుస్తారు. ట్రాన్స్‌ఫర్ అయితే అక్కడకు మకాం మారుస్తారు. అందులో భాగంగా ఆ మహిళా ఎస్ఐ తిరుచానూరులో పనిచేస్తున్నప్పుడు సమీపంలోని లింగేశ్వరనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఆమె ముత్యాలరెడ్డిపల్లెకు వచ్చిన తర్వాత ఆ స్టేషన్ పరిధిలోకి వచ్చి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో నిఘా పెట్టిన ఎంఆర్ పల్లె పోలీసులు సోమవారం సాయంత్రం సీఐ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ధనలక్ష్మి నగర్‌లో దాడులు చేశారు. మహిళా ఎస్ఐ తమ్ముడు ప్రశాంత్, తల్లి, తిరుపతి అవిలాల, హైదరాబాదుకు చెందిన ఇద్దరు మహిళలు, తిరుచానూరుకు చెందిన ఓ విటుడిని పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా తల్లి, తమ్ముడు వ్యవహారశైలి నచ్చక, వారితో గొడవ పడి మహిళా ఎస్ఐ ఏడాది నుంచి వారికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఎస్ఐ మెడికల్ లీవ్‌లో వెళ్లిన తర్వాత మూడు నెలలుగా ధనలక్ష్మినగర్‌లో అద్దె ఇంటిని తీసుకుని ఆమె తల్లి, తమ్ముడు వ్యభిచార గృహం నడుపుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ సిటిజన్ యాక్ట్ పకడ్బందీగా అమలు

తిరుపతి అర్బన్: సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007ని పకడ్బందీగా అమలు చేయాలని దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ ఏడీ శ్రీనివాస్‌ను కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో హరేకృష్ణ ఉపాధ్యాయ అనే వ్యక్తి తనకు జీవన భ్రుతి కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా అయన కూమారుడు బిక్రం ఉపాధ్యాయ అనే వ్యక్తి నెలకు రూ.3,200 అందించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా నాయుడుపేట మండలం, పుదూరు గ్రామానికి చెందిన జయరామయ్య తన ఆస్తిని కుమార్తె, మనవళ్లు తీసుకుని సరిగా చూడడం లేదని ఇచ్చిన పిటిషన్ మేరకు సివిల్ కేసుగా భావించి తగు న్యాయం చేయాలని గూడూరు ఆర్డీఓను ఆదేశించారు.

మేయర్ హత్య కేసు విచారణ

చిత్తూరు అర్బన్: మేయర్ అనురాధ, ఆమె భర్త మోహన్ హత్య కేసు విచారణ సోమవారం చిత్తూరులోని మహిళా కోర్టులో కొనసాగింది. రెండో సాక్షి కిషోర్‌ను న్యాయస్థానం విచారించింది. బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ వాదనలు వినిపించారు. సాక్షుల వాంగ్మూలాన్ని న్యాయమూర్తి శాంతి నమోదు చేసుకున్నారు.

అలసత్వం లేకుండా అర్జీల పరిష్కారం



అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి



వినతి అందించేందుకు వచ్చిన పెద్దపంజాణి మండల వాసులు

చిత్తూరు అర్బన్: స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడికే పరిష్కరించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందగా వాటిలో.. చీటింగ్ – 2, కట్నం కోసం వేధింపులు – 2, భర్త వేదింపులు – 2, వేధింపులు – 5, ఆస్తి తగాదాలు – 3 చొప్పున అందాయని అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జగదీష్ తదితరులు ఉన్నారు.

నిర్ణీత గడువులో సమస్యల పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో ప్రజలు అందించిన వినతుల్లోని సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పూలే భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 188 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

- రేషన్ డీలర్ మూడు నెలలుగా బియ్యం పంపిణీ చేయడం లేదని పెద్దపంజాణి మండలం నెర్నిపల్లె గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు.
- తమ గ్రామంలో భూమిలో వేరే ఊరికి సంబంధించి సామాజిక భవనం నిర్మిస్తున్నారని ఐరాల మండలం కుళ్లంపల్లె వాసులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలోని పేదలకు ఆ భూమిని పంపిణీ చేయాలని కోరారు.
- తమ కాలనీలో రోడ్డు సౌకర్యం కల్పించాలని చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లె ఎస్టీ కాలనీ వాసులు విన్నవించారు. ఏళ్ల తరబడి మట్టి దారిలో రాకపోకలు సాగించలేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సోమవారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ హరినారాయణన్ వివరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించామన్నారు. పెండింగ్ క్లైయిమ్స్‌ను పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా అధికారిని నియమించామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ పద్మజ, పార్థసారథి పాల్గొన్నారు.

ఉపమాకలో వార్షిక కల్యాణోత్సవాలపై సమీక్ష

తిరుపతి అలిపిరి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు వార్షిక కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. ఆయన సోమవారం వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. అదేవిధంగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం, తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో మార్చి 2 నుంచి 8 వరకు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపైనా సమీక్షించారు. విజయవాడ డెప్యూటీ ఈవో వెంకటయ్య, డెప్యూటీ ఈవో(జనరల్) గుణభూషణ్‌రెడ్డి, వీజీవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయల స్థితిగతులు పరిశీలన



సోడిగానిపాళ్యంలో వివరాలు సేకరిస్తున్న శామ్యూల్ ఆనంద్ కుమార్

కుప్పం/ గుడుపల్లె : కుప్పం నియోజకవర్గంలోని ఊరునాయునికొత్తూరు, సోడిగానిపాళ్యం గ్రామాల్లో ఏక సభ్య కమిషన్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ సోమవారం పర్యటించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో వాల్మీకి, బోయ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశీలించారు. జీవనశైలి, విధానం, ఆహార పద్ధతులు, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. వారు పెళ్లి చేసుకునే విధానం, కుల వృత్తులు, అంత్యక్రియలు చేసే పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. వాల్మీకి, బోయలు చెప్పిన వివరాలను రికార్డు చేసుకున్నారు. ఆయా కులాలను ఎస్టీల్లో చేర్చే ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, తహసీల్దార్ గుర్రప్ప, గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు జగ్గయ్య, మురళీనాయక్, నాయకులు నాగభూషణమ్మ, సుబ్బరాజు, ఈశ్వర్, గిరిప్రసాద్, గణపతి, బాబు, విభూషణ్, సురేష్, ఉమాపతి పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై పళ్లికొండేశ్వరుని కటాక్షం



రావణబ్రహ్మ వాహనంపై స్వామివారు



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

- ఉదయం త్రిశూల స్నానం
- ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లిలోని సర్వమంగళాదేవి సమేత పళ్ళికొండేశ్వ స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం రాత్రి శ్రీ పళ్ళికొండేశ్వర స్వామి రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహన సేవలో అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉదయం 10 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా త్రిసూల స్నానం కన్నులపండుగగా నిర్వహించారు. చివరగా ధ్వజావరోహణంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలను ముగించారు. బ్రహ్మోత్సవాలు నిర్వహించిన 10 రోజుల పాటు ఆలయంలో సేవలందించిన ప్రభుత్వ, ప్రవేటు అధికారులు, సిబ్బందికి ఆలయ చైర్మన్ ఏవీయం బాలాజీ రెడ్డి ఆలయం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉభయదారులుగా శ్రీసిటీ ఎండీ రవిసన్నా రెడ్డి వ్యవహరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ట్రస్టు బోర్డు చైర్మన్ ఏవీయం బాలాజీ రెడ్డి, సభ్యులు, ఈఓ రామచంద్రారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు రాధాకృష్ణా రెడ్డి, సభ్యులు ఆనందుడు, సురేష్, మంజుల, మునివేలు, చిత్ర, కవిత, సత్య, అజయ్ కుమార్, సిబ్బంది శరవణ, దండపాణి, పరంధామన్ పర్యవేక్షించారు.



అమ్మ ఒడిలో అక్షరం

ప్రతి ఒక్కరు మాతృభాషను ప్రేమించాలని సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని సనత్‌కుమార్ అమ్మ ఒడిలో అక్షరం అనేలా మండల తీర ప్రాంతంలోని సముద్రం వద్ద సోమవారం సైకత శిల్పాన్ని రూపొందించారు.

- చిల్లకూరు